క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

కౌటాల: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపు ఉదయం 11 గంటలకు ఎంపీపీ బసార్‌కర్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

జాతర విజయవంతం చేయాలి

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామ సమీపంలోని ప్రాణహిత నది పుష్కర్‌ఘాట్ ఒడ్డున గల శ్రీ శివసంత కార్తీక్ స్వామి మహరాజ్ మందిర్ ప్రశాంత నిలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఆలయంలో గోపాల కళ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన రమేశ్ ఆర్థిక సాయం అందించారు. జగన్నాథ్‌పూర్ గ్రామానికి విద్యార్థులు శ్రావణి, అంజలి, మంజుల భట్‌పల్లిలోని పాఠశాలకు రావడానికి ఆటో చార్జీలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రమేశ్ వారికి ఆటో చార్జీలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి, అందవెల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల్లో యాసంగి సీజన్‌లో సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న, శనగ పంటలను బుధవారం వ్యవసాయాధికారి రామకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో మొగిపురుగు సమస్యతో ఎర్రబడుతుందని, నివారణకు ఎకరానికి 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లుకోవాలన్నారు. అయినా పురుగు ఉధృతి ఉంటే కోరాజిన్ 60ఎంఎల్‌లో పాలిరాం కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈవో యువరాణి, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాజీవ్‌నగర్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. తైబానగర్ కాలనీకి చెందిన ఇంతియాజ్ ఖాన్ ఆటోట్రాలీలో తరలిస్తుండగా, పట్టుకున్నామని తెలిపారు. ఈమేరకు ఆటో ట్రాలీని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు.

లారీ అసోసియేషన్‌పై ఫిర్యాదు

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ లారీ అసోసియేషన్ సభ్యులు ఓవర్‌లోడ్ పేరుతో లారీలను ఆపి, జరిమానా విధిస్తున్నారని కొత్త లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ ఖాన్ కలెక్టర్, ఎస్పీ, ఆర్టీవోలకు బుధవారం ఫిర్యాదు చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో ప్రవేశించిన ప్రతీ లారీకి రూ. 500 అక్రమంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల సామగ్రి వేలం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనంలోని సామగ్రికి బుధవారం హెచ్‌ఎం భానుప్రకాష్ వేలం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ వేలం పాట ద్వారా శిథిలావస్థ భవనంలో ఉన్న సామగ్రికి రూ.20వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, ఎస్‌ఎంసీ చైర్మన్ పోశన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

చింతలమానెపల్లి: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. బుధవారం మండలంలోని దిందా గ్రామంలో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకయ్య, రైతు సమితి మండల కన్వీనర్ నారాయణ, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ దుర్పబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. బుధవారం మండలంలోని నార్దా గ్రామంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ భీంరావు, న్యానేశ్వర్, జగన్నాథ్‌రావు, భరత్ తదితరులు ఉన్నారు.

తెగులు.. గుబులు!

- వరికి సోకిన ఎండు తెగులు, పీక పురుగు
- ఎదుగుదల లేని పంట
- ఇష్టారీతిన మందుల పిచికారీ


దహెగాంలో తెగులు సోకిన వరి పంట

దహెగాం: మండలంలో రైతులు పత్తి పంట తర్వాత అధికంగా వరి పంట సాగు చేస్తున్నారు. పది రోజుల క్రితమే వరి నాట్లు వేయడం కూడా పూర్తయింది. కాగా వరి పంటకు ప్రస్తుతం తెగుళ్ల సోకుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల నివారణ కోసం అనేక రకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినా తెగుళ్ల అదుపులోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

పెరుగుతున్న ఖర్చులు

గత వర్షాకాలంలో భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి పంటలను ముంచేశాయి. ఖరీఫ్‌లో పంటలు తీవ్రంగా నష్టపోగా యాసంగిలోనైనా పంటలు భరోసానిస్తాయని రైతులు ఆశ పడ్డారు. అయితే పంటలకు తెగులు పట్టడంతో రైతులు గుబులు చెందుతున్నారు. విపరీతమైన రసాయనిక మందుల పిచికారీ వల్ల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని వాపోతున్నారు.

ఆరు వేల ఎకరాల్లో వరి సాగు..

మండలంలో ప్రధానంగా పత్తి తరువాత అధికంగా వరిని సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ యాసంగిలో 6వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఖరీఫ్‌లో సుమారు 10 వేల ఎకరాల్లో వరి ఉండగా యాసంగిలో కేవలం బోర్లు ఉన్నవారు మాత్రమే వరి పంట సాగు చేస్తున్నారు.

తెగుళ్ల సోకడానికి కారణాలు..

- పిలక దశ నుంచి దుబ్బు చేసే దశలో ఉన్న వరి పైర్లలో నాచు ఉండడం వలన ఎదుగుదల పూర్తిగా ఆగిపోతుంది.
- పొలంలో చవుడు, జింక్ లోపం వంటి సమస్యలను నివారించడానికి సిఫారసు చేయని సేంద్రియ గుళికలు, హ్యూమిక్ యాసిడ్, సీ -వీడ్ ఎక్స్ట్రాక్ట్‌ను వేయడం, పొలాన్ని పూర్తిగా నెర్రలు ఏర్పడే వరకు ఎండగట్టడం వల్ల తెగుళ్ల సోకుతున్నాయి.
- యాసంగిలో మొగిపురుగు ఉధృతి అధికంగా ఉంది. దీనిని నివారించడానికి రైతులు క్లోరిపైరిఫాస్ 10జి గుళికలు, సేంద్రియ గుళికలు యూరియాలో కలిపి వేయడంతో పాటు సైపర్ మెత్రిన్ లేదా క్లోరిపైరిఫాస్ పురుగుల మందులను పిచికారీ చేయడం వల్ల పురుగు నివారణ జరగడం లేదు.
- ఫిబ్రవరి, మార్చి నెలల్లో వరి పంటకు అగ్గి తెగులు (మెడవిరుపు) కూడా వచ్చే అవకాశం ఉంది. యూరియాను మోతాదుకు మించి వాడడం వల్ల తెగుళ్ల అధికంగా సోకే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

సూచనలు పాటించాలి

వరిలో ప్రస్తుతం ఎండు తెగులు, పీక పురుగు ఉన్నట్లు గుర్తించాం. వాటి నివారణకు 15 నుంచి 40 రోజుల దశలో ఉన్న పైర్లలో కార్బోఫ్యూరాన్ 3జి 10 కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 4జి ఎకరానికి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి బురద పదనలో వేయాలి. అగ్గి తెగులు, దోమపోటు వంటి తెగుళ్ల కూడా సోకవచ్చు.

- వంశీకృష్ణ, ఏవో, దహెగాం

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- సమావేశానికి కొందరే హాజరు
- సమస్యలపై ప్రశ్నించని సభ్యులు
- గంటన్నరలో ముగిసిన మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ ముండె విమలాబాయి

వాంకిడి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండె విమలాబాయి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశానికి తక్కువ మంది సభ్యులు హాజరు కాగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీసేందుకు సాహసించలేదు. హాజరైన వారిలో కొందరు సమావేశం పూర్తి కాకముందే బయటికి వెళ్లిపోయారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వ్యవసాయ శాఖ నివేదికతో ప్రారంభమైన సమావేశం 10శాఖల నివేదికలతో ముగిసింది. మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని, లీకేజీలు అధికంగా ఉన్నాయని కొందరు సర్పంచులు ప్రశ్నించారు. దుబ్బగూడ గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం కోసం భవనం మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ మంగళ సభా దృష్టికి తీసుకెళ్లారు. ఐకేపీలోని గ్రూపు సభ్యులు పొందే రుణాల్లో సిబ్బంది కమీషన్లు అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని ఎంపీపీ ముండె విమలాబాయి ఏపీఎం మహేష్‌కు సూచించారు. మండలంలో 19వేలకు పైగా జాబ్‌కార్డుదారులు ఉండగా అందులో 12వేల మంది మాత్రమే ఆధార్ అనుసంధానం చేయించుకున్నారని, ఇంకా 7,300 మంది ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉన్నందున్న సర్పంచులు, సభ్యులు సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఈవో మనుకుమార్, మిషన్ భగీరథ ఏఈ శైలేందర్, పీఆర్ఏఈ స్టీవెన్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్ కుమార్, సీడీపీవో రెబ్కా, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో విద్యార్థిని మృతి


నాగేంద్ర (ఫైల్)

కెరమెరి: క్యాన్సర్ మహమ్మారి బారిన పడి విద్యార్థిని మృతి చెందిన సంఘటన మండలంలోని చిత్తగూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తగూడ గ్రామానికి చెందిన కోట్నాక రాంశావ్, కాసుబాయిలకు ఒక కొడుకు, నలుగురు కూతుళ్లు. వీరిలో మూడో కూతురు నాగేంద్ర ఊట్నూర్‌లో తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుంది. డిసెంబర్‌లో ఆమెకు తీవ్ర జ్వరం రాగా ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చేర్పించారు. కొన్ని రోజుల చికిత్స అనంతరం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఇంటికొచ్చిన ఐదు రోజుల్లోనే మళ్లీ జ్వరం అధికమైంది. దీంతో ఆసిఫాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. పరీక్షించిన వైద్యులు క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని వెంటనే హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో నాగేంద్ర గత నెల 18 నుంచి హైదరాబాద్‌లోని ఎంఎన్‌జేలో చికిత్స తీసుకుంటుంది. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి నాగేంద్ర మృతి చెందింది. చిన్న వయస్సులోనే క్యాన్సర్‌తో మృతిచెందడంతో చిత్తగూడ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అందవెల్లి వంతెన నిర్మాణ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి వద్ద పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన మరమ్మతు పనులను బుధవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరిశీలించారు. వర్షాకాలం పెద్దవాగు ఉధృతికి మూడు పిల్లర్లు కూలిపోవడంతో, తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పించారు. శాశ్వత పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లగా, వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనుల ప్రక్రియ ప్రారంభం కాగా, ఎమ్మెల్యే పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సిర్పూర్(టి): మండలంలోని లక్ష్మీపూర్, మండల కేంద్రంలోని బెంగాలీ క్యాంపు కాలనీల్లో బుధవారం సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నూతన సీసీరోడ్ల పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ. 40లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఉప సర్పంచ్ తోట మహేష్, వార్డు సభ్యుడు ఇఫాత్ హుస్సేన్, నాయకులు అఖిల్ అహ్మద్, రాందాస్, అస్లాం గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కోనప్ప కృషి అభినందనీయం'


సన్మానిస్తున్న మాలీ సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: మాలీలకు ఎస్టీ హోదా కల్పించడం కోసం సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కృషి అభినందనీయమని మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురే శ్యామ్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో సంఘం సభ్యులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే కోనప్పను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మాలీలకు ఎస్టీ హోదా ప్రధాన లక్ష్యంగా అనేక ఉద్యమాలు చేశామన్నారు. ఎస్టీ హోదా కోసం కృషి చేస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్యేలతో పాటు సిర్పూర్ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, గ్రామ పటేల్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా సీసీరోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


దహెగాం: మాట్లాడుతున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణాలను వచ్చేనెల 10లోగా పూర్తి చేయాలని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 8 గ్రామపంచాయతీలకు 32సీసీ రోడ్లు మంజూరయ్యాయని, రోడ్లను వేగవంతంగా, నాణ్యతగా పూర్తి చేయాలన్నారు. ఎంపీపీ శంకర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు సిద్ధిక్, ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని పలు గ్రామాలకు 34 సీసీరోడ్లు మంజూరయ్యాయని, వాటిని గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మంజూరైన సీసీ రోడ్లను మార్చి10 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 6 జీపీలకు పక్కా భవనాలు సైతం మంజూరయ్యాయని పేర్కొన్నారు. వేసవి వస్తున్నందున తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. సమావేశంలో పీఆర్ ఏఈ ఆత్మారాం, ఈజీఎస్ ఏపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో గంగాసింగ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఏపీవో సతీష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పదోన్నతి.. బాధ్యతను పెంచుతుంది'


ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారి అప్పలకొండ

ఆసిఫాబాద్అర్బన్: ఉద్యోగ విధి నిర్వహణలో పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని, ప్రభుత్వ అధికారులకు బదిలీలు సహజమని ఆసిఫాబాద్ అటవీశాఖ రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. ఆసిఫాబాద్ రేంజ్ పరిధిలో ఫారెస్టు బీట్ అధికారులుగా విధులు నిర్వహించి పదోన్నతిపై ములుగు జిల్లాకు వెళ్తున్న శంకర్, యాదవ్‌రావ్, ఇంతియాజ్ హుస్సేన్‌లను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారులు యోగేష్, ప్రవీణ్‌కుమార్, సరోజారాణి, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఏఎంసీ చైర్మన్

ఆసిఫాబాద్: ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌ను ఏఎంసీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు లాలా, అబ్దుల్లా, అమర్‌బిన్ అహ్మద్, విమలేశ్, సుదర్శన్ గౌడ్ ఉన్నారు.

సఖీ మహిళలకు అండగా ఉంటుంది

ఆసిఫాబాద్‌రూరల్: సఖీ మహిళలకు అండగా ఉంటూ, సేవలు అందిస్తుందని సఖీ నిర్వాహకురాలు మౌనిక అన్నారు. బుధవారం మండలంలోని అంకుసాపూర్, తేలిగూడ, కొటగూడ గ్రామ మహిళలకు సఖీ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గృహహింస, వేధింపులకు గురైతే వెంటనే 181 కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలి వేంద్రం ప్రారంభిస్తున్న సీఐ రాణాప్రతాప్

ఆసిఫాబాద్: వేసవి తాపం తీర్చేందుకు ఎంఐఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ పంపు సమీపంలో బుధవారం సీఐ రాణాప్రతాప్ చలివేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయన వెంట సీఐ గంగన్న, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు ఎండీ సల్మాన్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మీర్ కశీఫ్ అలీ హస్మీ, సహాయ కార్యదర్శి షేక్ ఆరిఫ్, షకీల్ అహ్మద్, మహ్మద్ పాషా, అయిమన్, అముది, తమీమ్, శహబాజ్, ఫైజల్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రతీ గడపకు చేర్చాలి


మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్

వాంకిడి: మండలంలోని ఇందాని, ఖిరిడి గ్రామాల్లో బుధవారం ప్రజాగోష.. బీజేపీ భరోసా కార్నర్ సమావేశాలను నిర్వహించారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా ఇన్‌చార్జి జోగిరాల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మరాం నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కృష్ణ కుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను ప్రతీ గడపకు చేర్చేందుకే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు రామగిరి శ్రావణ్ పాల్గొన్నారు.

శేషగిరి ఆశయ సాధనకు కృషి చేయాలి


నివాళులర్పిస్తున్న నాయకులు

రెబ్బెన: శేషగిరి ఆశయ సాధనకు ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని గోలేటి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.జగ్గయ్య అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం శేషగిరి 75వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం శేషగిరి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీనివాస్, ఫిట్ కార్యదర్శి రాజేష్, దివాకర్, నాయకులు నర్సయ్య, రాజ్‌కుమార్, దిలీప్, కోశి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలి

రెబ్బెన: మహాశివరాత్రి పురస్కరించుకుని నంబాల ప్రసన్న పరమేశ్వర ఆలయంలో నిర్వహించే జాతర ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని సీఐ అల్లం నరేందర్ అన్నారు. బుధవారం ఎస్సై భూమేష్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లు పరిశీలించారు. ఆలయంలో కల్పిస్తున్న సౌకర్యాల వివరాలను ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ చైర్మన్ రంగు మహేష్‌గౌడ్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్, ఉప సర్పంచ్ అశోక్, సభ్యులు కుశన్న, రాజన్న, నాయకులు శ్రీకాంత్, మహేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేత..

ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రెబ్బెన సీఐ అల్లం నరేందర్ అన్నారు. బుధవారం గోలేటి పంచాయతీ పరిధిలోని సోనాపూర్, కోలాంగూడ గ్రామంలోని 25 మంది గిరిజన వృద్ధులకు, 25 కుటుంబాలకు పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు.

సూదుల ప్రకాష్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న మైనింగ్ స్టాఫ్ సిబ్బంది

రెబ్బెన: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీపీ త్రీలో అండర్ గ్రౌండ్ గనిలో గతంలో జరిగిన ప్రమాదానికి బాధ్యున్ని చేస్తూ విధుల నుంచి తొలగించిన షాట్ ఫైరర్ సూదుల ప్రకాష్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మైనింగ్ స్టాఫ్ సిబ్బంది కోరారు. ఈమేరకు బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మైనింగ్ స్టాఫ్ మల్రాజు శ్రీనివాస్‌రావు, సాగర్, రాజశేఖర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

కౌటాల: కౌటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్నాక్స్‌ను బుధవారం ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రాంచందర్ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్నాక్స్ పంపిణీ చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు శ్యాంరావ్, సత్యనారాయణ, సంతోష్, సుమలత, సంతోషి, రేఖ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

22 నుంచి డీఈడీ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: డీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలు ఈనెల 22 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రేపు రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: సీఎం చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 17న స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: సివిల్ సర్వీసెస్ పరీక్షా విధానంపై కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు చదరంగం పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా జిల్లా క్రీడా, యువజనశాఖ ఆధ్వర్యంలో మహిళలకు చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారి మణెమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడ సమీపంలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు కళాశాలలో రిపోర్ట్ చేయాలని కోరారు. వివరాలకు గిరిజన క్రీడల అధికారి మధుసూదన్ 9573105057, సామ్రట్ 70952 73428 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.